ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం

ఆనందపేటలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే ముస్తఫా, డిప్యూటీ మేయర్ సజీల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆనందపేట 3వ లైన్‌లో గల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాతో కలసి రాష్ట్ర ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటి వద్దకే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని వివరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటన చేసినప్పుడు ప్రజలకు క్యాంప్‌ల్లో మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. గుంటూరు అర్బన్, రూరల్ పరిధిలో 536 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, గురువారం 500మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ క్యాంప్‌ల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల్ని ఎప్పటికప్పుడు జిల్లాస్థాయిలో సమీక్ష చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అనారోగ్య బాధితుల్ని గుర్తించి క్యాంపులపై అవగాహన కల్పించారని చెప్పారు. నగరంలోని 29 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రస్తుతం అనారోగ్యం వస్తే ప్రైవేట్ వైద్యశాలలకు వెళితే వేలల్లో ఖర్చులు అయ్యే పరిస్థితి ఉందని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల ఇంటి వద్దకే అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న ఫుడ్ బాస్కెట్‌ని అందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, కార్పొరేటర్లు మీరావలి, ఆబీద్, ఈతు కోటేశ్వరరావు, ఎస్.ఎస్. ఆయుబ్ ఖాన్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మెడికల్ ఆఫీసర్స్ , సచివాలయ సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.


క్లుప్తంగా

చలపతి విద్యార్థులకు ఫార్మా 2కే23 అవార్డులు



గుంటూరు రూరల్: ఔషధాల వినియోగాన్ని మెరుగుపరిచి మందుల లోపాలను తగ్గించటం ద్వారా రోగుల భద్రతను, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమైందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఫార్మా కౌన్సిల్ ఆధ్వర్యంలో నగరంలోని వైద్యకళాశాల జింకానాలో జరిగిన ఫార్మా అవార్డ్ 2కే23 కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థులకు అవార్డుల పంట పండిందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ చేతుల మీదుగా తమ కళాశాల విద్యార్థులు అవార్డులు అందుకోవడం సంతోషకరమని తెలిపారు. తమ కళాశాలలో బీ ఫార్మసీ విభాగం నుంచి పి. రమ్యశ్రీ, ఫార్మాడీ విభాగం నుంచి ఎం. లావణ్య, ఎం ఫార్మసీ నుంచి టి. రవళిక, అనాలసిస్ నుంచి ఏ. సాయిదివ్య, ఫార్మాకాలజీ నుంచి పి. చైతన్యసాయి, రెగ్యులేటరీ ఎఫైర్ నుంచి ఎం. లక్ష్మీదివ్య, ఎస్. సాయితేజస్వి అధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు అవార్డులు అందజేశారన్నారు. ఈ సందర్భంగా చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అధ్యాపకులు అవార్డులు పొందిన విద్యార్థులను అభినందించారు.

ప్రముఖ న్యాయవాది కాయితి సైదారెడ్డి మృతి



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ బిల్డింగ్ కమిటీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది కాయితి సైదారెడ్డి (65) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాల్ని సక్షం సేవా సంస్థకు దానం చేశారు. సైదారెడ్డి ఏబీవీపీలో పూర్తిస్థాయి కార్యకర్తగా పని చేశారు. అనంతరం భారతీయ జనతాపార్టీలో గుంటూరు అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా వివిధ బాధ్యతల్లో పనిచేసి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర బిల్డింగ్ కమిటీ ప్రముఖ్‌గా ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం స్తంభాలగరువులోని మహాప్రస్థానంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, భీమినేనీ చంద్రశేఖర్, తోట శంకరరావు, అప్పిశెట్టి రంగారావు, నేరెళ్ల మాధవరావు, ఈమని మాధవరెడ్డి, తాడువాయి రామకృష్ణ సంతాపం తెలిపారు.

ఉర్దూ పాఠశాలలో రికార్డుల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: ఆనందపేటలోని నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను గురువారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని ఆయన పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమలు, తీరుతెన్నులపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు.

బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూనగర్: బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ నాయకులు గురువారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె చాంబర్‌లో కలసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీ స్థల పన్ను వేయడంతో ఆలస్యం జరుగుతోందని తెలిపారు. మార్ట్‌గేజ్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీలో తీవ్ర జాప్యం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. సమస్యల్ని పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిల్డర్స్ ప్రతినిధులు నాగ వంశీ, శ్రీనాథ్, మధుసూదనరెడ్డి, సీతారామయ్య, సురేష్‌బాబు, శ్రీనివాస్‌కుమార్, దుర్గాప్రసాద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పార్టీ మరింత బలోపేతం

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



అప్పిరెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా, సురేష్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలంతా పూర్తి సమన్వయంతో ఉమ్మడిగా కలసి పనిచేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కత్తెర హెనీ క్రిస్టీనా, తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ దంపతులు ఆయన్ను సాదరంగా స్వాగతించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణుల్ని ఎన్నికలకు సమాయత్తం చేసే క్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌నేతృత్వంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ లేళ్ల అప్పిరెడ్డిని శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమించడం ద్వారా సమర్థుడైన రాజకీయ నాయకుడికి సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారని తెలిపారు.

నగరపాలక సంస్థ ఉద్యోగులకు చార్జ్ మెమోలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులకు బుధవారం రాత్రి కమిషనర్ కీర్తి చేకూరి చార్జ్ మెమోలు జారీ చేశారు. సుద్దపల్లి డొంకలో 750 గజాల స్థలానికి ఇద్దరు హక్కుదారులు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. అయితే, ఇందులో ఒకరు సదరు స్థలం పన్నులతో పాటు అక్కడ ఉన్న భవనాన్ని తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పాటు హక్కుదారుడు కాని వారికి పన్ను పేరు ఏ విధంగా మార్చారంటూ కోర్టు ప్రశ్నించింది. దీనిపై స్వయంగా వచ్చి సమాధానం చెప్పాలని నగర కమిషనర్‌కు, సీడీఎం ఏకు సమన్లు జారీ చేయడంతో పది రోజుల కిందట ఇద్దరూ హాజరయ్యారు. దీనిపై నగర కమిషనర్ కీర్తి చేకూరి, గతంలో ఆర్వోగా పని చేసి ప్రస్తుతం సీడీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్న వేణుకు, ఆర్ఐ హయత్‌షా వలి(మున్నా)లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటికి సరైన సమాధానం రాకపోవడంతో బుధవారం రాత్రి ఇద్దరికి చార్జ్ మెమోలు జారీ చేశారు. ప్రస్తుతం వేణు విదేశాల్లో ఉండటంతో అతనికి మెయిల్ ద్వారా మెమో పంపించారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ప్రత్తిపాడు: చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా గ్రామీణ నీటి సరఫరా , పారిశుద్ధ్య విభాగం డీఈ రమేష్ అన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని స్వచ్ఛభారత్ మిషన్, యూనిసెఫ్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రతపై గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈ రమేష్ హాజరయ్యారు. ఏడు దశల్లో చేతుల పరిశుభ్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జనల తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని జిల్లా కోర్డినేటర్ షఫీ ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా లేకపోవడం వలన అనేక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. చేతుల పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు, కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని సూచించారు. తొలుత విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈ అనిల్ కుమార్, ఏఈ వినీల్ కుమార్, మండల విద్యాశాఖధికారి సీహెచ్ రమాదేవి, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, జిల్లా కో ఆర్డినేటర్ షఫీ, సాయి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడకే అన్ని జబ్బులకు మందు



మందులు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, పక్కన డాక్టర్ నరేంద్రరెడ్డి, మల్లేశ్వరరెడ్డి

గుంటూరు మెడికల్: ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, నడక దాదాపు అన్ని జబ్బులకు మందు అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి చెప్పారు. వరల్డ్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకొని ఐఎంఏ గుంటూరు బ్రాంచి, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్‌లో ఆర్థరైటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు ప్రారంభించారు. వాకర్స్‌తో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీఎండీ మిషన్ ద్వారా ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందుల్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఎముకల పరిపుష్టికి కాల్షియం ఆధారిత ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రోజూ నడకతో మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు



తనిఖీల అనంతరం అధికారులతో సమీక్ష చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసబాబు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగాల ఆధ్వర్యంలో గుంటూరు డీ–10 సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో గురువారం అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సాయిబాబా కాలనీ, పొన్నూరు రోడ్డు, బుడంపాడు ప్రాంతాల్లో 56 మంది అధికారులు, 158 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. 4,028 సర్వీసులను పరిశీలించారు. అనుమతులు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 266 మందికి రూ. 15.25 లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర విభాగాల్లో విద్యుత్ వాడుతున్న ఐదుగురికి రూ.1.50 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 261 మందికి రూ. 13.75 లక్షల అపరాధ రుసుం విధించారు. దాడుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు టి.శ్రీనివాసబాబు, కె.సూర్యప్రకాష్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, ముస్తాక్ అహ్మద్, ఏఈలు కోటేశ్వరరావు, దేవదాస్, అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో అబెట్ అక్రిడిటేషన్ ప్రాసెస్ బృందం



విజ్ఞాన్‌లో అబెట్ అక్రిడిటేషన్ బృందం సభ్యులతో వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో అబెట్‌ను (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) అక్రిడిటేషన్ ప్రాసెస్ కమిటీ బృందం తనిఖీ చేసింది. అమెరికా నుంచి వచ్చిన 11 మంది సభ్యులతో కూడిన బృందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ మాట్లడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌కు దరఖాస్తు చేసుకుని తనిఖీ పూర్తి చేసుకున్న మొట్టమొదటి యూనివర్సిటీ విజ్ఞాన్ అని తెలియజేశారు. అబెట్ అక్రిడిటేషన్ సాధించిన ట్లయితే విదేశాలలో ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలియజేసారు. వీటితో పాటు విదేశాలలో ఉన్న యూనివర్సిటీలతో విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్స్, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఐక్యూఏసీ సిబ్బంది, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట ఒకటో లైనులోని ఓ లాడ్జిలో వ్యభిచారం జరుగుతోందనే సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడి చేశారు. విటుడు, మహిళతో పాటు ఇద్దరు నిర్వాహకుల్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుల వద్ద నుంచి రూ. రెండు వేలు స్వాధీనం చేసుకున్నారు. మహిళను రెస్క్యూ హోంకు తరలించారు.

నాలుగో అంతస్తు నుంచి కిందపడి మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: అపార్టుమెంటు నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు మహిళ కిందపడి మృతి చెందిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎస్ నగర్‌లోని బృందావన్ అపార్టుమెంటు నాలుగో అంతస్తు ఫ్లాట్‌లో ఆవుల గాయత్రి (31) నివసిస్తున్నారు. బాల్కనీలో దుస్తులు ఆరేస్తూ గురువారం ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందింది. గాయత్రి పెదనాన్న పి.నరసింహారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

మహిళ అదృశ్యంపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతీనగర్ 5వ లైనులో నివాసం ఉండే గోపి భార్య స్వాతి ఈనెల 8న ఇద్దరు పిల్లల్ని తీసుకుని భర్తకు చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న గోపి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల్లో గెలుపే ధ్యేయం



పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో గురువారం జరిగిన పశ్చిమ నియోజకవర్గ జగనన్న కనెక్ట్ సోషల్ మీడియా వారియర్స్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

ఫార్మసీ కళాశాల అధ్యాపకులకు సన్మానం



ప్రిన్సిపాల్ ప్రమీలారాణిని సన్మానిస్తున్న వీసీ



డాక్టర్ గంగాధర్‌ను అభినందిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఇటీవల విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల జాతీయ స్థాయిలో 63వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. ప్రమీలారాణిని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి అధికారులు సన్మానించారు. అనంతరం గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ప్రమీలారాణి, ఫార్మసీ కళాశాల ర్యాంకుల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. రవిని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అభినందించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ గంగాధర్‌కు ఉత్తమ సైంటిస్ట్ అవార్డు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మ్యాథమాటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రతిఏటా అందించే వరల్డ్ 2% మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ సైంటిస్ట్ అవార్డుకు ఆయన్ను ఎంపిక చేసింది. ఎంపిక వివరాలను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్‌ను గురువారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, నూటా అధ్యక్షుడు డాక్టర్ బి. నాగరాజు, నాక్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ సంధ్య కోల్ తదితరులు అభినందించారు.

ప్రొఫెసర్ సరస్వతీ రాజు అయ్యర్‌కు ఓషన్ కన్సర్వేషన్ మీట్‌కు ఆహ్వానం

యూనివర్సిటీ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ అధ్యాపకురాలు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్‌కు ప్రతిష్టాత్మక సదస్సు నుంచి ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న మాంటరి బె అక్వేరియం గ్లోబల్ ఓషన్‌లో ఈనెల 16 17 తేదీల్లో జరిగే సోషల్ సస్టైనబులిటీ అడ్వైజర్ గ్రూప్ మీటింగ్ లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా గురువారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్, సీడీసీ డీన్ ఆచార్య కె. మధుబాబు ఆమెకు అభినందనలు తెలిపారు. ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ మాట్లాడుతూ తాను చేసిన పరిశోధన అంశాలతో మాంటరీ బే మీటింగ్‌లో పత్ర సమర్పణ చేయనున్నానని తెలిపారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోండి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి, మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డిని కోరారు. ఈ మేరకు గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కలసి వినతి పత్రం సమర్పించారు. అప్పిరెడ్డిని కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, గుంటూరు జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి, సాయి ఉన్నారు.

లలితా హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



ప్రమాదానికి గురై కోలుకున్న బాబూరావుతో డాక్టర్ పోలవరపు అనురాగ్, వైద్య బృందం

గుంటూరు మెడికల్: ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ సెప్టెంబరు 21న రోడ్డు ప్రమాదానికి గురై, కుడిచేతికి తీవ్ర గాయమైన 42 ఏళ్ల ఎ.బాబూరావుకు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని లలితా హాస్పిటల్ ఎండోవాస్క్యులర్ ఇంట్రవెన్షన్ చీఫ్ డాక్టర్ పోలవరపు అనురాగ్ చెప్పారు. స్థానిక కొత్తపేట లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాబూరావుకు రోడ్డు ప్రమాదంలో చేతికి గాయమై చెయ్యి నీలి రంగుగా మారి, తిమ్మిరి ఏర్పడిందని, మణి కట్టు వద్ద కూడా నాడి పని చేయలేదని తెలిపారు. దాదాపు చేయి పోయేస్థితిలో లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకువచ్చారని చెప్పారు. బాబూరావును పరీక్షించి, కుడి చేతికి రక్తాన్ని సరఫరా చేసే. ధమని (రక్తనాళం) పూర్తిగా తెగిపోయిందని గుర్తించామని డాక్టర్ అనురాగ్ చెప్పారు. సెప్టెంబరు మూడో వారంలో ఎమర్జెన్సీ వాస్క్యులర్ రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీ చేసి బాబూరావు ప్రాణాలు కాపాడామని తెలిపారు. ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ తాడిబోయిన అవినాష్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కె.ఆనందబాబు, డాక్టర్ సునీల్ నంద పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు.

చల్లావారిపాలెంలో కేరళ ప్రతినిధుల బృందం పర్యటన

గుంటూరు రూరల్: గ్రామాల అభివృద్ధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందంజలో ఉందని జిల్లా పరిషత్ సీఈవో జె.మోహనరావు తెలిపారు. గురువారం కేరళకు చెందిన ప్రతినిధుల బృందం బీతు బాలకృష్ణన్ తదితరులు చల్లావారిపాలెం గ్రామాన్ని సందర్శించారు. సీఈవో మాట్లాడుతూ చల్లావారిపాలెం గ్రామం 2001–2015 ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు సెలక్టయిన సందర్భంగా కేరళ ప్రతినిధుల బృందం గ్రామాన్ని సందర్శించిందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం, గ్రామ సచివాలయం పనితీరును తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ప్రజల ఇంటివద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి

తెనాలి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ఎంతో కృషి చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పలు సంఘాల నుంచి ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.బాబు, కార్యదర్శిగా ఎం.సుధాకరరావు, గౌరవాధ్యక్షుడిగా పి.వీరయ్యబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మనోజ్‌కుమార్, గ్యారేజ్ అధ్యక్షుడిగా డీడీఎస్.రావు, కార్యదర్శిగా వి.జోషిబాబును ఎన్నుకున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా కార్యదర్శిగా ఈపూరి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.